

నేడు హలో ఆదివాసీ చలో పార్వతీపురం

ప్రజాశక్తి - కురుపాం

బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలలో చేర్చొద్దని 19న తలపెట్టిన హలో ఆదివాసీ చలో పార్వతీపురం కార్యక్రమంలో ఆదివాలసీంతా పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన జెఎసి నాయకులు పువ్వుల సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు . ఈ సందర్భంగా ఆయన ఆదివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసి గిరిజన తెగల్లో కొత్తగా సుమారు ఐదు నుంచి ఆరు కులాలు బోయ వాల్మీకి, బొంతుఒరియా, వడ్డెర కమ్మర మత్స్యకారులు, రజక, మేదర కులాలను ఎస్‌సి జాబితాలో కలిపే ప్రభుత్వ ఆలోచన నిర్ణయాన్ని ఖండిస్తున్నమని తెలిపారు. వారిని తమ తెగల్లో కలప కూడదని, దానివల్ల గిరిజనులకు చాలా నష్టం జరుగుతుందన్నారు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పార్వతీపురంలోని పాత బస్ స్టాండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఆదివాసీ గిరిజన ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరగబోవు భారీ ర్యాలీకి ఆదివాసీలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.



పాత కురుపాం వద్ద దళారులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతులు

కళ్లాల్లో ధాన్యం... రైతు కళ్లలో దైన్యం

- నేటికీ ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- చోద్యం చూస్తున్న అధికారి యంత్రాంగం
- దళారులే దిక్కవుతున్న దుస్థితి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు అన్ని రకాల సేవలందించడమే లక్ష్యంగా ఒక వ్యవసాయ సహాయకుడ్ని ఒక ఆర్‌బిఐ కేంద్రానికి నియమించింది. అంతవరకు బాగానే ఉన్నా అధికారులు రైతులకు సేవలందించడంలో ప్రభుత్వం ఆశించినంతగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో సుమారుగా 20 రోజుల క్రితం వరి కోతలు జరిగి నూర్పు చేసి అమ్మడానికి సిద్ధంగా ఉన్నా ఏ ఒక్క రైతు భరోసా కేంద్రంలో కూడా కొనుగోలు కేంద్రం ఇంతవరకూ ఏర్పాటు చేయలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ఉండేందుకు వీలుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతు శ్రమకు తగ్గ ఫలితం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. అధికారుల అలసత్వం వల్ల ధాన్యం కొనుగోలు లేకపోవడంతో ఎక్కడికక్కడే కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.

మండలంలో 8030 ఎకరాల్లో వరి సాగైంది. ఈ పంట దిగుబడికి సరిపడే గోనె సంచులు కొనుగోలులో అధికార యంత్రాంగం విఫలమైంది. పంటకోతలు పూర్తయిన తర్వాత రైతులు ధాన్యం నిల్వ చేసుకునే పరిస్థితుల్లేవు. దీంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించే వరకూ అన్నదాతకు కంటిపై కునుకు పడడంలేదు. ఆకాల వర్షం కురిస్తే ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీళ్లపాలయ్యే ప్రమాదం నెలకొంది. నూతన సాంకేతిక విధానంతో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. కొనుగోళ్లలో అత్యంత కీలకమైన గోనె సంచుల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికార యంత్రాంగం పౌరసరఫరాల సంస్థ నుంచి గోనె సంచులను సమకూర్చుకోవాలి. కొనుగోలుకు నెల ముందు ప్రణాళికా బద్ధంగా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలి. రైతుల అవసరాలకు తగ్గట్లుగా సంచులు అందుబాటులో తీసుకురావాలి. ఆ దిశగా చర్యలు లేకపోవటంతో ధాన్యం సేకరణకు, లోడింగ్, అన్లోడింగ్స్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు గోనె సంచులు ఇవ్వక, కేంద్రాల్లో ప్రారంభించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

పరికరం పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం

రైతు భరోసా కేంద్రంలో ధాన్యం తేమ పరికరం పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీంతో దశమంతపురం రైతు భరోసా కేంద్రం వద్దకు ధాన్యాన్ని మచ్చుకు తీసుకువెళ్లి తేమను పరిశీలన తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

కె.గణపతి, రైతు
చలివేంద్రి, వీరఘట్టం మండలం

ఎక్కడ ధాన్యం అక్కడే

వీరఘట్టం : మండలంలోని ఈ ఏడాది 10,200 మంది చిన్న, సన్న కారు రైతులు 16వేల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో 24 రైతు భరోసా కేంద్రాల్లో 19 ధాన్యం కొనుగోలు కేంద్రాను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం తలవరం, పనస నందివాడ, రేగులపాడు, హుస్సేన్‌పురం, వండువ, తెట్టంగి, నడిమి కెల్ల, చిదిమి కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు ఏజెన్సీలో 40 వాహనాల ద్వారా ధాన్యం తరలించినట్లు చెబుతున్నారు.

పనిచేయని తేమ పరికరం

మండలంలోని చలివేంద్ర రైతు భరోసా కేంద్రంలో ధాన్యం తేమ పరిశీలించే పరికరం గత వారం రోజులుగా పని చేయడం లేదు. దీంతో రైతులు ధాన్యాన్ని సమీపంలో ఉన్న దశమంతపురం రైతు భరోసా కేంద్రం వద్దకు తీసుకెళ్లి తేమను పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా చలివేంద్ర, నర్సిపురం, బూరుగ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు లేకపోవడంతో కల్లాల్లో కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి.

వాహనాలు మీరే పెట్టుకోవాలి

ధాన్యం తరలించేందుకు వాహనాలు మీరే పెట్టుకోవాలని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు ఏజెన్సీ ద్వారా వాహనాలు ఏర్పాటు చేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వాహనాలు మీరే ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం దానికి రవాణా చార్జీల కింద మీ ఖాతాలకు జమవుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి కె.మన్మధరావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తవించగా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పడి గాపులు తప్పడంలేదు

ధాన్యం కొనేందుకు ఎవరూ రాకపోవడంతో బస్తాల్లో ధాన్యం సిద్ధం చేసి కళ్లల్లో పడి కాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు ప్రచారాలకే పరిమితం అవుతున్నారు.

రామినాయుడు రైతు
వీరఘట్టం .



తూనిక తక్కువ ఉందని అన్‌లోడ్ చేయకపోవడంతో ట్రాక్టర్‌పైనే ఉన్న ధాన్యం బస్తాలు

తక్కువ తూకం పేరిట అన్‌లోడ్‌కు నిరాకరణ

ప్రజాశక్తి - భామిని

మిల్లర్ల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏదో నెపంతో రైతులను ఇబ్బందులకు గురి చేసి వారి నుంచి చౌకగా ధాన్యం విక్రయించేందుకు మిల్లర్లు బరితెగిస్తున్నారు. ఇలాంటి సంఘటనే మండలంలో ఆదివారం చోటు చేసుకుంది.

మండలంలోని బాలేరుకు చెందిన రైతు కొత్తకోట తిరుమలరావు తాను పండించిన 50 బస్తాలు ధాన్యం ఆర్‌బికె వ్యవసాయ సహాయకులు జ్యోష్న సూచనలు మేరకు ట్రాక్టర్‌తో గురండి సమీపంలో శ్రీ సాయి మణికంఠ రైస్ ఇండస్ట్రీస్ తీసుకువెళ్లారు. సదరు మిల్లు యజమాని ఒక బస్తా తూకంలో 80కేజీలకు అరకేజీ తేడా వచ్చిందని తెలిపాడు. దీంతో రైతు మరొక ధాన్యం బస్తాను తూకం వేయాలని చెప్పాడు. ఈసారి 80కేజీలకు అదనంగా అరకేజీ వచ్చింది. తూనికలో తేడా నెపంతో మిల్లు యజమాని ఆ ధాన్యాన్ని సాయంత్రం వరకూ అన్‌లోడ్‌కు నికరించాడు. దీంతో విషయం తెలుసుకున్న బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, ఆర్‌బికె సాంకేతిక సహాయకులు మిల్లు వద్దకు చేరుకుని వేయింగ్ బ్రిడ్జ్ ద్వారా ఒక్కసారి మొత్తం బస్తాలు తూకం వేయగా సరిపోయింది. దీంతో మిల్లు యజమాని అన్లోడింగ్ చేశారు. అనంతరం ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడతూ తూకం తేడా పేరుతో అదనంగా ధాన్యం అడగొద్దని, రైతులు అటువంటి తూనికలు తేడాలు చేయరని, ప్రతి రైతు మిల్లరు బస్తాకు 80కేజీ కంటే అదనంగా ధాన్యం ఇవ్వవలసిన అవసరం లేదని తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

'ఎన్‌సిఎస్'ను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -సీతానగరం


మండలంలోని లచ్చయ్యపేటలో గల ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని, ఇందుకు రైతులంతా పోరాడాలకు సిద్ధంగా కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని రామవరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఫ్యాక్టరీని ఈ ప్రాంతం రైతులను కాపాడాల్సిన బాధ్యత పాలక పక్షం, ప్రతిపక్షంపై ఉన్నాయి. అయితే సిఎం జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు ఇద్దరూ కలిసి యాజమాన్యంతో కుమ్మక్కై చెరుకు రైతులకు తీరని ద్రోహం చేశారన్నారు. ఫ్యాక్టరీని ఎవరికీ తెలియకుండా అమ్మకానికి పెట్టినట్లు వార్తలు వస్తున్నాయని, దీన్ని రైతులు, ప్రజలంతా ఖండించి, కాపాడుకోవడానికి పోరాడాలని పిలుపునిచ్చారు. లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ వల్ల సీతానగరం, బొబ్బిలి మండలాలతో పాటు, చుట్టుపక్కల 10 మండలాల రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందారని, రైతులు తమ పిల్లలను మంచి చదువులు చదివించుకుని వారికి మంచి భవిష్యత్తును అందించారని అన్నారు. రైతులతో పాటు పరోక్షంగా ఎన్నో కుటుంబాలకు ఉపయోగకరంగా ఉన్నటువంటి ఈ ఫ్యాక్టరీని మూత దిశగా గత పాలకులతో పాటు, నేటి పాలకులు అనుసరించిన విధానాలే కారణమని విమర్శించారు. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీని అమ్మేయడానికి నేటి ప్రభుత్వం సిద్ధ పడుతుందని, రైతులు, సంఘాలు ఎన్నో పోరాటాల ద్వారా ఈ ఫ్యాక్టరీని కాపాడుకున్నాయని, రైతు సంఘం నాయకులు నిర్బంధాలు, జైలు జీవితాలను సైతం లెక్కచేయకుండా రైతుల పక్షం వహించి అలుపెరుగని పోరాటాలు చేసిన ఖ్యాతి ఉందని అన్నారు. మాది రైతు ప్రభుత్వమని వైసిపి, రైతులకు తాము న్యాయం చేస్తామని టిడిపి చెబుతున్నారని, వీరికి వాస్తంగా రైతులపై చిత్త శుద్ధి ఉంటే సుగర్ ఫ్యాక్టరీ అమ్మకం ఆపాలని, రైతుల పక్షాన పోరాడాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, వి.ఇందిర, ఆర్.శ్రీదేవి, రెడ్డి రమణమూర్తి, ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివురుగప్పిన నిప్పులా 'హైడ్రో పవర్' ముప్పు

- కురుకుట్టిలో ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదన
- 600 ఎకరాల్లో రూ.4600 కోట్లతో అంచనా
- రగులుతున్న మన్యం గిరిజనం
- నోరు మెదపని అధికార గణం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో న్యూపంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ముప్పు నివురు కప్పిన నిప్పులా పొంచి వున్నట్లు తెలుస్తోంది. గతంలో మండలంలోని కురుకుట్టి, సారిక పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ నెడ్ క్యాప్ ఆదేశాల మేరకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇంజనీరింగ్ ఏజెన్సీ ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించింది. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు కానున్న ఈ పవర్ ప్రాజెక్టును అదానీ గ్రూపు నిర్మించనుంది. సుమారు 600ఎకరాల్లో రూ.4600 కోట్ల వ్యయంతో 1200 మెగావాట్ల పవర్ ప్రాజెక్టు చేయనున్నట్లు టిసిఎస్ సర్వే నివేదికను అందజేసింది. రెండు చోట్ల ఎగువ రిజర్వాయర్, దిగువ రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించింది. ఆరు నెలల క్రితం కురుకుట్టి పంచాయతీ పరిధిలో ఉన్న దొరలతాడివలస, మూలతాడివలస, సారిక పంచాయతీ నేరెళ్ళవలసలోని గ్రామాల్లో ప్రతిపాదిత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇంజనీరింగ్ ఏజెన్సీ ఉద్యోగులు మట్టి నమూనాలు సేకరించారు. ఒడిశాలోని కొండల మధ్య నుంచి జాలువారే సెలయేటి నీటిని రిజర్వాయర్లలోకి మళ్లించి విద్యుత్ ఉత్పత్తి చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నిత్యం ప్రవహించే ఈ సెలయేటి నీటిని ఉపయోగించి సమీప గ్రామాల గిరిజనులు ఏడాది పొడవునా పంటలు పండిస్తున్నారు.



సారిక వద్ద రిగ్గు తవ్వుతున్న టిసిఎస్ బృందం సభ్యులు (ఫైల్)

గతంలో మట్టి నమూనాల సేకరణ కోసం రిగ్గు బోర్లతో తవ్వినప్పుడు ఈ ప్రాంతానికి చెందిన గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తవ్వకాలను కొద్దిరోజుల పాటు అడ్డుకున్నారు. ప్రాజెక్టు ఏర్పాటుకు తాము సర్వే చేస్తున్నామని టిసిఎస్ సర్వే సంస్థ ఉద్యోగులు చెప్పారు. దీనిపై జిల్లా నెడ్ క్యాప్ అధికారులు వివరణ ఇచ్చారు. కురుకుట్టి పంచాయతీ పరిధిలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు టిసిఎస్ సంస్థ మట్టినమూనాలు సేకరిస్తోందని, సర్వే నివేదిక ప్రభుత్వానికి అందిన తర్వాతే ప్రాజెక్టు ఏర్పాటుపై స్పష్టత వస్తుందని తెలిపారు. ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే ప్రభావిత గ్రామాల అభిప్రాయం తీసుకున్నాకే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఏఏ గ్రామాలు ప్రభావితం అవుతాయి

సారిక పంచాయతీ నేరెళ్లవలస, సారిక, సొంపిగాం గ్రామాల తోపాటు కురుకూటి పంచాయతీ దొరలతాడివలస, మూల తాడివలస, జాకరవలస గ్రామాలు ఈ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రభావితం అయ్యే అవకాశాలు ఉన్నాయి. సుమారు 600ఎకరాల్లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించడంతో ఈ గ్రామాలను ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాంత గిరిజనుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పవర్ ప్రాజెక్టు ముప్పు పొంచి వుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనేక సార్లు అదానీ గ్రూపు సంస్థల అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించడంతో గిరిజనుల్లో అనుమానాలు మరింత బలపడుతు న్నాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆధ్వర్యాన పార్టీ నాయకులు ఈ ప్రాంతంలో కొద్దిరోజుల క్రితం పర్యటించారు. పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు నివేదిక ప్రభుత్వానికి అందిందని, ఎప్పుడైనా ప్రభుత్వం పనులు ప్రారంభించవచ్చునని గిరిజనులతో చెప్పారు. ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకు ప్రాంతంలో ఎర్రవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపింది. ఈనేపథ్యంలో ఆ ప్రాంత గిరిజనులు పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అరుకు, పాడేరు ప్రాంతంలో ఒక రోజు బంద్‌కు గిరిజన సంఘాల న్నీ పిలుపునిచ్చాయి. పవర్ ప్రాజెక్టు ఏర్పాటు పై ముందుకు వెళ్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని గిరిజనులు హెచ్చరించారు.

నోరు మెదపని అధికారగణం

కురుకుట్టి ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుపై ఇంతవరకు అధికారపార్టీ నాయకులు గానీ, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు నోరు మెదపడం లేదు. ఈ నియోజకవర్గానికే చెందిన డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరకు కూడా దీనిపై స్పష్టత లేదని తెలుస్తోంది. పవర్ ప్రాజెక్టు ఏర్పాటు, దాని ప్రభావం వల్ల ఐదారు గ్రామాల గిరిజనులు నిరాశ్రయులవు తారనే ప్రచారం జరుగుతున్నా స్థానిక అధికారిపార్టీ నాయకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం చర్చనీయాంశ మవుతోంది. ఏమైనా నియోజకవర్గ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో కూడా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ముప్పు పొంచి వుందనేది స్పష్టమవుతోంది.



గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సంక్షేమ పథకాలు పేదలకు వరం : రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్షని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. ఆదివారం విశ్వనాధపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్నదొరకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయా లేదా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల సత్యవతి, గొర్ల గణపతి, గొర్ల తిరుపతిరావు, పి వీరమనాయుడు, ఇజ్జాడ అప్పలనాయుడు, సోములు సావిత్రి, ఎం.మధుసూదనరావు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై 26న చలో కలెక్టరేట్


విజయనగరం టౌన్ :కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, ఉపాధ్యక్షులు పి.దుర్గారావు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ 40 ప్రకారం సమగ్ర శిక్ష, కెజిబివి, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు.


రీసర్వేపై అపోహలొద్దు

- ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు
- పూర్తి స్థాయిలో మ్యుటేషన్ల పరిష్కారం
- పార్వతీపురం రెవెన్యూ డివిజన్ అధికారి కె.హేమలతతో ముఖాముఖి

భూముల రీసర్వేపై ఎలాంటి అపోహలొద్దని, రీ సర్వే వల్ల రైతులకు ఎటువంటి నష్టం జరగదని పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి అధికారి కె.హేమలత చెప్పారు. రీసర్వే ద్వారా రైతుల పొలం, కో-ఆర్డినేట్ పాయింట్లను గుర్తించి, పొలం మ్యాప్, వారి పాస్ పుస్తకాల్లో పొందుపర్చనున్నట్టు తెలిపారు. రీసర్వేకు రైతులంతా సహకరించి రీసర్వే జరుగుతున్న సమయంలో వారు తప్పనిసరిగా హాజరై వారి భూమి సరిహద్దులను సరిచూసుకొని భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో రైతులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. డివిజన్‌లో భూ ముటేషన్లను ఎప్పటికప్పుడు పరిష్కారమౌతున్నట్టు చెప్పారు. డివిజన్‌లో జరుగుతున్న రెవెన్యూ కార్యకలాపాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖికి ఆమె వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే...

- ప్రజాశక్తి, కలెక్టరేట్





రీ సర్వే ప్రాముఖ్యత ఏమిటి?

వందేళ్ల క్రితం తయారైన రికార్డుల్లో జరిగిన మార్పులను గుర్తించి, అప్పటికి, ఇప్పటికీ భూస్వరూపం, భూ వర్గీకరణలో మార్పులు, భూ యజమానుల మార్పులు చాలా వరకు జరిగాయి. అలాగే చాలా చోట్ల ప్రభుత్వం రిజర్వాయర్ల నిర్మాణానికి, కాలువల తవ్వకానికి, రోడ్లు వేయడం కోసం భూసేకరణ జరిగింది. ఈ రీసర్వే ద్వారా ప్రస్తుతం భూమి స్వరూపం, వర్గీకరణ మొదలైన విషయాలు మ్యాపులో పొందుపర్చడం జరుగుతుంది.

జిల్లాలో మొదటి విడత ఎన్ని గ్రామాల్లో రీ సర్వే జరిగింది? రెండో విడత ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేయనున్నారు?

జిల్లాలో మొదటి విడతలో 102 గ్రామాల్లో రీసర్వే జరిగింది. రెండో విడత ఫిబ్రవరి నెలాఖరుకు వంద గ్రామాల్లో రీసర్వే చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం. డివిజన్ పరిధిలో 54 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేయడం జరిగింది.

రీసర్వే రైతులకు అవగాహన కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించడానికి ఏ గ్రామంలో అయితే రీసర్వే చేసామో ముందుగా ఆ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి, ఆ గ్రామస్తులందరకీ ఆ గ్రామ పరిధిలో ఏ ఏ రోజు ఏ ప్రాంతంలో రీసర్వే చేయబోతున్నామో తెలియజేస్తున్నాం. తమ ప్రాంతంలో రీసర్వే జరిగేటప్పుడు రైతులు తప్పనిసరిగా హాజరు కావాలి. రైతులు తమ భూమి యొక్క హద్దులను సరిచూసుకోవడం ద్వారా రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ఉంటుంది. రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగినా రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదు. సంబంధిత అధికారులను సంప్రదిస్తే పరిశీలించాక సరి చేయడం జరుగుతుంది.

ధాన్యం కొనుగోలులో జరుగుతున్న ఇబ్బందులకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. రోజుకొక కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్నాను. ధాన్యం రవాణాలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పౌర సరఫరాల డిఎం దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాను.

జిల్లాలో ఎన్ని ముటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి?

జిల్లాలో ఇంతవరకు 7428 ముటేషన్లకు దరఖాస్తులు చేయగా, ఇందులో 7413 ముటేషన్లు పూర్తి చేయబడ్డాయి. 15 ముటేషన్లు తహాశీల్దార్ల వద్ద పెండింగ్లో ఉన్నాయి. ఏదైనా ముటేషన్ దరఖాస్తులు రిజెక్ట్ అయితే వెంటనే రీ ఎంక్వయిరీ చేయించి కారణాలను కనుక్కోవడం జరుగుతుంది. వాటిపై తెగిన చర్యలు తీసుకుంటున్నాం.

ఘనంగా ఘంటసాల నిర్విరామ నీరాజనం

ప్రజాశక్తి - సాలూరు



ఘంటసాల పాటలు ఆలపిస్తున్న గాయకులు

స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం స్థానిక కబీర్ షా ఆర్కెస్ట్రా ఆధ్వర్యాన ఘంటసాల నిర్విరామ నీరాజనం కార్యక్రమం జరిగింది. 12గంటల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ఘంటశాల ఆలాపించిన మధుర గీతాలను వర్ధమాన గాయకులు పాడారు. అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు సంగీతం నేర్పిన గురువు సాలూరు పట్టణానికి చెందిన వారేనని చెప్పారు. పట్రాయుని సీతారామ శాస్త్రి వద్ద ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత పాఠాలు నేర్చుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాలుగు గాయక బృందాలు పాటలు పాడి ఆహూతులను అలరించాయి. ఏటా డిసెంబర్‌లో ఘంటశాల నిర్విరామ నీరాజనం పేరుతో స్థానిక కబీర్ షా ఆర్కెస్ట్రా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, ప్రముఖ వ్యాపారవేత్తలు మండవిల్లి వెంకటేశ్వరరావు, పట్నాల ఈశ్వరరావు, నిర్వాహక కమిటీ సభ్యులు రాంప్రసాద్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు రూ.10వేలు వేతనాలు చెల్లించాలి

వీరఘట్టం: గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రూ .పదివేలు వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని గల చెత్త సంపద కేంద్రంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో విధులు నిర్వహిస్తున్న అంబాసిడర్లకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క మండలంలో ఒక్కొక్కలాగా అమలు చేస్తున్నారని, జీవో 57 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య ఈనెల 20న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎన్ ప్రసాద్ రావు, అంబాసిడర్లు పాల్గొన్నారు.

సంజీవరావు మాస్టర్ మృతి బాధాకరం

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో దాదాపు 30 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెద్దింటి సంజీవరావు మాస్టారు అకస్మాత్తుగా అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 1989లో చేరిన సంజీవ రావు వృత్తి పట్ల అంకితభావం కలవారని, ఏజెన్సీ ప్రాంతంలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేసి మంచి పేరు పొందారన్నారు. కొంతకాలం గుమ్మలక్ష్మీపురం మండల ఎంఆర్పీగా కూడా సేవలందించారన్నారు. సంజీవరావు మృతి పట్ల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు పి.దేవానంద్, వి.నారాయణరావు, కె.త్రినాధరావు, సిహెచ్ చిరంజీవులు, పి నిర్మల్ కుమార్, పి అనంతరావు, పి అంతోని, పి చిన్నారావు సంతాపం వ్యక్తం చేశారు.


నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, యువకులు

రేషన్ డిపో ద్వారా సరుకులు పంపిణీ చేయాలి

కొమరాడ : సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు గతంలో మాదిరిగా లేవానని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. పండగ కానుకల ద్వారా వస్తువులు పంపిణీ చేయాలని కోరుతూ స్థానిక జూనియర్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డిపో ద్వారా పండగ వేళ పంచదార, ఉప్పు, పప్పు, బెల్లం, నూనె, చింతపండు ఇతర నిత్యావసర సరుకులు కేరళ రాష్ట్రం మాదిరిగా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎక్కడా అమలు కాని పరిస్థితి ఉందని తెలిపారు. గ్యాస్‌తో పాటు పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు, గిరిజన సంఘాల నాయకులు ఉపేంద్ర, రామారావు, లక్ష్మణరావు, సుబ్బారావు, వెంకట్రావు, అక్కయ్య, ప్రసాదు, శుక్రు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో గడపగడపకు

వీరఘట్టం : మండల కేంద్రంలోని నాలుగో సచివాలయ పరిధిలో ఈనెల 19న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేజర్ పంచాయితీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచి పి.గౌరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నారని తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు దేవానంద్‌కు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం : ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఐదో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు రాష్ట్ర బాలకథానిలయం ఉపాధ్యక్షులు, మండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్‌కు ఆహ్వానం వచ్చింది. దేవానంద్‌తో పాటు సాహితీ చైతన్య కిరణాలు, బాలకథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావుకు కూడా ఆహ్వానం వచ్చింది. వీరికి ఆహ్వానం రావడం పట్ల వారి మిత్రులు మద్ది సుధాకరరావు, కింతలి వెంకట్రావు, పైడా కొండలరావు, షేక్ ఇబ్రహీం, తదితరులు అభినందించారు.


ర్యాలీ చేస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

పరిశుభ్రతపై ర్యాలీ

పాలకొండ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కార్గిల్ జంక్షన్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. శానిటేషన్‌పైకమిషనర్ సామంచి సర్వేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ మన చుట్టూ ఉండే పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వేళాపాలా లేని తాగునీటి సరఫరా

పార్వతీపురం టౌన్ : పట్టణంలో పలు వార్డుల్లో తాగునీటి సరఫరా నాలుగు రోజులకొకసారి, ఐదు రోజులకు ఒకసారి జరుగుతుండడంతో పాటు వేళాపాళా లేకుంటున నచ్చిన సమయంలో తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 24, 25, 26 27, వార్డుల్లో తాగునీరు సరఫరా చేయడంతో స్థానిక మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో బురద నీరు సరఫరా, శీతాకాలంలో నాలుగు రోజులకు ఒకసారి మున్సిపల్ అధికారులు తాగునీటి సరఫరా ఇవ్వడంతో వచ్చే వేసవి నాటికి ఇంకా ఎంత అధ్వానంగా తాగునీటి సరఫరా జరుగుతుందో అని పట్టణ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు .


రాత్రిపూట నీళ్లు పడుతున్న మహిళలు


పాడైపోయిన బోరును చూపుతున్న విద్యార్థులు

ఆరు నెలలైనా తాగునీటి సమస్య పట్టదా?

హాస్టల్ విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక బిసి బాలుర వసతిగృహంలో తాగునీటి బోరు పాడై ఆరునెలలైనా అధికారులు పట్టించుకోవడంలేదని, దీంతో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి బోరు మరమ్మతులు చేయాలని కోరుతూ విద్యార్థులు స్థానిక హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మోటారు పాడై ఆరు నెలలైనా బాగు చేయలేదని, దీనివల్ల విద్యార్థులు తాగునీటికి, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేద విద్యార్థుల పట్ల అధికారులు చిన్నచూపు మానుకొని యుద్ధప్రాతిపదికన బోరు బాగు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా, బాగు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ బాగుచేయకపోవడంతో బహిర్భూమికి విద్యార్థులు బయటకు వెళ్తున్నారన్నారు. దీంతో వారు విష సర్పాల బారినపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పై సమస్యలు పరిష్కారం చేయకపోతే ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

యథేచ్ఛగా అక్రమ కలప రవాణా

ప్రజాశక్తి -భామిని

మండలంలోని అంబేద్కర్ ప్రధాన కూడలి నుంచి మాణిగ, పరిడి గ్రామాల మీదుగా ఒడిశాకు అనుబంధంగా బిటి రోడ్డు కలప అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. భామిని తివ్వకొండల్లో ఉన్న విలువైన కలప, ఒడిశాలో సేకరించిన కలప రవాణాకు ఈ మార్గం రాచమార్గంగా మారింది. ఈ రోడ్డు ఒడిశాకు అనుబంధగా ఉండటం, గతంలో ఒడిశా నుండి అక్రమంగా గుట్కా, సారా, కలప రవాణాను అడ్డుకట్టడానికి భామిని ఎఫ్‌సిఐ గోడౌన్ సమీపాన చెక్‌పోస్టు ఉండేది. ఈ చెక్‌పోస్టు ఇటీవల ఎత్తివేయడంతో కలప అక్రమ రవాణాకు రాచమార్గంగా మారింది. ఈ మార్గం గుండా గతంలో గుట్కా, సారా, కలప అక్రమ రవాణాను పోలీసులు చెక్‌పోస్ట్ ద్వారా నిలువరించారు. ప్రస్తుతం చెక్‌పోస్టు లేకపోవడంతో ఒడిశా నుంచి రాత్రుళ్లు


వ్యానులో తరలిపోతున్న కలప

కలపతో పాటు, గుట్కా, సారా, పశువులు, గంజాయి అక్రమంగా రవాణా చేసే అవకాశాలు ఉన్నాయి. భామిని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు నిఘా ద్వారా పట్టుకునే అవకాశం ఉన్నప్పటికీ ఇటు రెవెన్యూ, అటు పోలీస్ అధికారులు పట్టించుకొనే పరిస్థితి లేదు. అధికారులతో అక్రమ కలపరవాణాదారులు అంతర్గత ఒప్పందం వల్లే పట్టించుకోవడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కలప అక్రమ రవాణాపై నిఘా వేసి దోషులను కఠినంగా శిక్షించి, అటవీసంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

వినోద్ మిశ్రాకు ఘన నివాళి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిన్న ఘోర కాలనీలో ఆదివారం వినోద్ మిశ్రా వర్ధంతి వేడుకలు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు మాట్లాడుతూ వినోద్ మిశ్రా సేవలను కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్‌పి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు 35 పుట్టిన రోజు వేడుకలు స్థానిక నక్కలపేట శిరిడి సాయిబాబా ఆవరణలో ఆదివారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పల్ల కొండబాబు ఆధ్వర్యంలో రామసేన అధ్యక్షులు సారిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోసారి కూడా శ్రీకాకుళం ఎంపీగా గెలవాలని ఆకాంక్షించారు. యువతకు ఒక రోల్ మోడల్‌గా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పడాల రాంబాబు, రాజు, కిషోర్, గణేష్ కుమార్, సన్నీ, నిరంజన్, కిషోర్, అశోక్, సాయి, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు అభిమాని నాయకులు హాజరయ్యారు.

సీతంపేట : శ్రీకాకుళం ఎంపి కె.రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో తాలాడలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తన తండ్రి ఎర్రన్నాయుడు ఆశయాలు నెరవేర్చాలనే దడ సంకల్పంతో రామ్మోహన్ నాయుడు పనిచేస్తున్నారన్నారు. అనంతరం గిరిజన వద్దులకు దుప్పట్లు


యువతకు వాలీబాల్ కిట్టు అందజేస్తున్న టిడిపి నాయకులు భూదేవి

పంపిణీ చేశారు. అలాగే తాలాడ, మూర్తిగాడి గూడ యూత్ కు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.కుంపి, తాలాడ ఉప సర్పంచ్ సవర ప్రసాద్, వార్డు సభ్యులు సవర బాలకృష్ణ, వెంకటరావు, స్థానిక నాయకులు శరత్‌బాబు, భూగన్న, ఆనప లక్ష్మణరావు, లక్కయి, లచ్చన్న, వెంకటగూడ గణేష్, బాలరాజు, మోహన్, ఊయక భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు పోటెత్తిన పర్యాటకులు

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ పర్యాటకలతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తరలివచ్చారు.పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు జల విహార వద్ద బోటు షికారు చేశారు హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ, యువకులు నడిచి వెళ్లారు. ఆల్టన్ వెహికల్ పార్కు చుట్టుముట్టారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెరలు కొట్టారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి కేరింతలు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

ఏజెన్సీలో ముమ్మరంగా వరి చేను కోతలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలో గిరిజన రైతులు వరి చేను కోతల్లో బిజీగా ఉన్నారు. కేదారిపురం, దుమ్మంగి, లక్కగూడ, దొరజమ్ము, దుడ్డుఖల్లు, దేరువాడ తదితర ప్రాంతాల్లో కల్లాలు వేసుకుని వరికోతలు, నూర్పులు చేపడుతున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో వరి పంట ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 80 శాతం వరి చేను కోతలు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల వద్ద అమ్మకానికి సన్నాహాలు చేస్తున్నారు.


యువతకు హాకీ కిట్లు అందజేస్తున్న ఎస్ఐ కిశోర్‌వర్మ

హాకీ జట్టుకు స్పోర్ట్స్ కిట్ వితరణ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట హాకీ టీంకి దోనుబాయి ఎస్సై కిషోర్ వర్మ ఆదివారం స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో రూ.25వేలు విలువచేసే హాకీ కిట్లను ఉచితంగా అందజేశారు. హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

వంట చెరకు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు



గ్యాస్ భారం... కట్టెల కోసం సుదూరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్ బండ ధరలు నిరుపేద గిరిజనులకు ఆర్థిక భారంగా మారింది. గ్యాస్‌తో పాటు ఆయిల్, పప్పు దినుసుల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోవడంతో పేదలు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్యాస్ వినియోగం తగ్గించుకునేందుకు కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్నారు. ఇందుకోసం సుదూర ప్రాంతాల్లో ఉన్న అడవులకు వెళ్లి కట్టెలమోపులను ఇంటికి తీసుకువస్తున్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

సీతంపేట : మండలంలోని కేసరజోడు పంచాయతీ దిబ్బగూడాలో గిరిజనులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఎపి సిఎన్ఎఫ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ పి.దేవుళ్లు ఆదివారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వెలుగు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేయడం బాగానే ఉందని, అధిక లాభాలు వస్తాయని తెలిపారు. అరటి పంట సాగు గురించి రైతులు తెలిపారు. జీడిమామిడికి సోకే టిదోమపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, డైరెక్టర్ సంజీవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాలాడలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని తాలడ పంచాయతీ పరిధిలో తాలాడ, వెంకటగూడలో టిడిపి నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో ధరల పెరుగుదల, చార్జీల పెంపు, పథకాల కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.కుంపి, తాలాడ ఉప సర్పంచ్ సవర ప్రసాద్, వార్డు సభ్యులు సవర బాలకృష్ణ, వెంకటరావు, స్థానిక నాయకులు శరత్‌బాబు, భూగన్న, ఆనప లక్ష్మణరావు, లక్కయి, లచ్చన్న, వెంకటగూడ గణేష్, బాలరాజు, మోహన్, ఊయక భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

కొడిశ పంచాయతీలో...

మండలంలోని కొడిశ పంచాయతీ కొడిశ, బిళ్లగూడ, బిళ్లగూడ కాలనీ, జమ్మడుగూడ, ఎఱ్ఱన్నగూడ గ్రామల్లో పాల్గొన్న పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవర ముఖలింగం, కొడిశ సర్పంచ్ సవర గంగయ్య, వైస్ సర్పంచ్ బిడ్డిక చంద్రరావు, మండల తెలుగురైతు అధ్యక్షులు సవర సోడంగా, సవర సూర్యం, మండలఉపాధ్యక్షులు బిడ్డిక స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం :రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని నాగూరు ఎంపిటిసి, టిడిపి సీనియర్ నాయకులు ద్వారపు రెడ్డి సత్యనారాయణ అన్నారు. వైసిపి మూడున్నర ఏళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అన్ని


కొడిశలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి కల్పన లేక ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా చితికి పోతున్నారని అన్నారు. గ్రామాల్లో తాగేందుకు నీరు లేకపోయినా మద్యం మాత్రం ఏరులై పారుతోందని అన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో ప్రజలను సంక్షోభంలోకి నేడుతున్నారని పేర్కొన్నారు. టిడిపి హయంలో ఇసుకను ఫ్రీగా అందిస్తే వైసిపి ప్రభుత్వం ఒక్కొక్క లోడ్‌కు వేలాది రూపాయలు వసూలు చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం కర్మ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుంటున్నమన్నారు. ఇదేం కర్మ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని చెప్పారు.

అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

అందరికీ ఆయన గురువు.. పాలకొండలోని నేటి జర్నలిస్టులకు మార్గదర్శకులు.. ఎంతో మందికి ఉపాధి మార్గం చూపిన ఆదర్శమూర్తి.. ఆయనే సీనియర్ పాత్రికేయుడు జొన్నగడ్డల కామేశ్వరరావు. జర్నలిజంలో విలువలకు ప్రాధాన్యత ఇచ్చే ఆయనకు విశాఖలోని ఇన్ఫో స్వచ్ఛంద సంస్థ బెస్ట్ ఎథికల్ జర్నలిస్టు అవార్డును ఇచ్చింది. ఈ సందర్భంగా ఆయన్ను పాలకొండ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువులు జర్నలిస్టులు మాట్లాడుతూ అందరికీ గురువు అయిన కామేశ్వరరావుకు అవార్డు రావడం పాలకొండకే గర్వకారణమన్నారు. జర్నలిజంలో ఎంతో మందిని మార్గదర్శకులుగా ఉండడమే కాకుండా ఫొటోగ్రఫీలోనూ తమకు ఓనమాలు నేర్పిన గురువు అని పలువురు తెలిపారు. ఉత్తరాంధ్రలో కొద్ది మందికి ఇచ్చే ఇటువంటి అవార్డు పాలకొండలోని కామేశ్వరరావు రావడం అంటే సామాన్యమైన విషయం కాదని, ఇటువంటి అవార్డులు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత జె.కామేశ్వరరావు మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవార్డుకు పాలకొండలోని జర్నలిస్టులే కారణమన్నారు. అందరూ తన కోసం చెప్పిన దాన్ని బట్టే అవార్డుకు


కామేశ్వరరావు సత్కరిస్తున్న జర్నలిస్టులు

తనను ఎంపిక చేశారని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సూరబత్తల గాంధీని సభ్యులు సన్మానించారు. పాలకొండ ప్రెస్‌క్లబ్ సభ్యులను ఏకతాటిపై నడిపిస్తున్న ఆయన సేవలను గుర్తించి సన్మానించారు. ఇదే విధంగా భవిష్యత్‌లో కూడా జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు వెళ్లాలని గాంధీ సూచించారు.

రాజాం టిడిపిలో గ్రూపుల పోరు

- అగ్ర నాయకుల్లో విభేదాలు..
- 2019 సార్వత్రిక ఎన్నికల నుంచి సీనియర్లలో ముసలం

ప్రజాశక్తి- రేగిడి

రాజాం నియోజకవర్గంలో రేగిడి, సంతకవిటి, వంగర, రాజాం మండలాలున్నాయి. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపి తరపున మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, కావలి ప్రతిభా భారతి వీరిద్దరూ విధేయులుగా ఉన్నారు. కొండ్రు మురళి మోహన్‌కు అధిష్టానం రాజాం టిడిపి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. దీంతో మురళీ, ప్రతిభా భారతి మధ్య సఖ్యత కొరవడింది. అధిష్టానం ఒకరికి ఎమ్మెల్యే సీటు ఇస్తే, రెండో వారు సహకరించకపోవడం వంటి సమస్య ఉంది. దీనికి తోడు రేగిడి మండలం మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణం నాయుడు, మాజీ మండల అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్‌లు కావలి ప్రతిభా భారతికి సపోర్టుగా నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో అధిష్టానం మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌కు టిడిపి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతిభా భారతి వర్గం సహకరించకపోవడంతో ఓడిపోయినట్లు టిడిపి వర్గీయులు చెబుతున్నారు. వీరిద్దరి మధ్య సఖ్యత కోసం సీనియర్ టిడిపి నాయకులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు కూడా పట్టించుకోకుండా మౌనం వహించడంతో 2019 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటమి చెందిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి మధ్య మాజీ మంత్రి కళా పంచాయతీ పెట్టకపోవడంతో నేటి వరకు ఎడ మొహం, పెడ మొహంలా ఉన్నారని, ఇప్పటికైనా పంచాయతీ చేయకుంటే 2024 సార్వత్రిక ఎన్నికలకు వైసిపి మరోసారి విజయం సాధించడం ఖాయమని టిడిపి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'కాపు' కాసేనా.?

ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన ఓట్లు ఎక్కువ శాతం ఉన్నాయి. మాజీ మత్రి కళా వెంకట్రావు కను సైగలలో రాజాం నియోజకవర్గం ఉండేది. 2014లో రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే ఎస్‌సి రిజర్వేషన్ అయింది. దీంతో కాంగ్రెస్ తరపున కోండ్రు మురళీమోహన్, టిడిపి తరపున కావలి ప్రతిభా భారతి, వైసిపి తరపున కంబాల జోగులు పోటీ చేశారు. తక్కువ మెజార్టీతో వైసిపి ఎమ్మెల్యే కంబాల జోగులు గెలుపొందారు. అనంతరం చంద్రబాబు నాయుడు సమక్షంలో అమరావతిలో కోండ్రు మురళీమోహన్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కొండ్రు పనితనాన్ని మెచ్చుకొని 2019 ఎన్నికల్లో టిడిపి టికెట్‌ను అధిష్టానం ఆయనకు కట్టబెట్టింది. స్థానిక అగ్ర నాయకుల్లో కొండ్రుకు సరైన మద్దతు లేక 24 వేల ఓట్లు మెజార్టీతో వైసిపి నాయకులు కంబాల జోగులు రెండోసారి గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు టిడిపి గెలవాలంటే ముందుగా కావలి ప్రతిభా భారతి, కొండ్రు మురళీమోహన్, కిమిడి వర్గీయులతో పంచాయితీ పెట్టి తేల్చుకోవాలని లేకుంటే టిడిపి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. అయితే పైన పేర్కొన్న ముగ్గురూ ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో ఈ సారి ఈ నియోజకవర్గంలో ఉన్న కాపు ఓటర్లు ఎవరుకు పట్టం కడతారోనన్న చర్చ జరుగుతుంది. వాస్తవానికి కళా వెంకటరావు కలుగు చేసుకుని ఈ పంచాయతీని పరిష్కరించి కాపు ఓటర్లకు ఒక్క విషచం చెబితే టిడిపి విజయం నల్లేరు మీద నడకలా మారిపోతుందని అంచనా వేస్తున్నారు. మరో మూడు రోజుల్లో ఈ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో ఇప్పుడు దీనిపై చర్చ జరుగుతోంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్ల : మండలంలో పాలవలస పంచాయతి పరిధిలోని నక్కలపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మున్నా కుమార్ రాయ్ (23) నక్కల పేట నుండి తన బైక్ పై విజయనగరం వైపు వెళ్తుండగా ఆ బైక్‌కు ఉన్న సైడ్ స్టాండ్‌ను తీయకుండా ప్రయాణం చేయడం వల్ల ఆస్టాండు రోడ్డుకు తగిలి బైక్ అదుపు తప్పి ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. మృతుడు మున్నా కుమార్ రాయ్ భార్య పల్ల ఆది లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

పార్వతీపురంరూరల్ : బైకును ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం ప్రకారం ఒడిశాలోని రాయగడ జిల్లా జిమిడిపేటకు చెందిన యడ్ల వెంకటరమణ తన కుటుంబ సభ్యులతో కలిసి పార్వతీపురం బైకుపై వస్తున్నారు. కొమరాడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటరమణతో పాటు ఆయన భార్య కవిత, కుమారులు హర్షవర్ధన్ (4), చైతన్య (11నెలలు) గాయపడ్డారు. ఈ సంఘటనలో చైతన్య, హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానికులు 108లో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.